క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్‌కు ఎంపిక

ఐనవోలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొనగా.. అండర్ 17, అండర్ 14 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయిలో పాల్గొనేందుకు ఎంపిక చేసినట్లుగా ఎంఈఓ తెలిపారు. సెలెక్షన్స్‌లో మండల నోడల్ అధికారి ఆనందం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, మండల సెక్రటరీ కైలాస్, ఇతర పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థుల నడవడికపై దృష్టిసారించాలి

ఐనవోలు : విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని ఉపాధ్యాయులు సూచించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల పురోగతి గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. అదే విధంగా పలు అంశాలపై చర్చించారు. అలాగే వైరల్ ఫీవర్‌లు వస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని చెప్పారు. వర్షాలు కురుస్తున్న కారణంగా నీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నాయని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలని సూచించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం

శాయంపేట : పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అన్న వసంత అన్నారు. పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడారు. ప్రస్తుత వాతావరణంలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారని, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని వైద్యుల సూచనలు పాటించాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించి, కాచి చల్లార్చిన నీరును తాగించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంతో లాభాలు

ఆత్మకూరు : పండ్ల మొక్కల పెంపకంతో రైతులు లాభాలు పొందుతారని జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కామారం గ్రామంలో శనివారం స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా క్లోరినేషన్ చేపట్టారు. అలాగే వాటర్ ట్యాంక్ వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. ఉపాధిహామీలో చేపట్టిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఈసీలు శ్రీధర్, రాము, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీఏ శ్రీధర్, ఎఫ్‌ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్‌కు గాయాలు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన కేబుల్ ఆపరేటర్ చేరాల సత్యనారాయణ శనివారం విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పంగిడిపల్లి అనుబంధ గ్రామం ధర్మనగర్‌లో సత్యనారాయణ కేబుల్ వైర్ సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ అనిల్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సత్యనారాయణకు ప్రథమ చికిత్స అందిస్తూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

గొర్రెల కాపరి మృతి

ఐనవోలు : గొర్రెల కాపరి అనుమానస్పదంగా మృతిచెందిన సంఘటన మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెలు మేపేందుకు పిట్టల రాజు(26) మూడు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రావాల్సిన రాజు ఇంటికి రాలేదు. మూడు రోజులుగా రాజు తల్లిదండ్రులు బంధువులను సంప్రదించినా ఆచూకి తెలియలేదు. శనివారం మధ్యాహ్నం గ్రామంలోని ఓ పాత ఇంటి పెరడులోని చెట్ల పొదలలో దుర్గంధం వస్తుండగా చుట్టుపక్కల వారు గమనించి రాజు మృతదేహంగా గుర్తించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై శ్రీనివాస్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిన రాజు శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మాణ పనులకు నిధుల కొరత

- ముందుకుసాగని బస్టాండ్ నిర్మాణ పనులు
- ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికుల ఇబ్బందులు
- నిధులు మంజూరు చేయాలని స్థానికుల విజ్ఞప్తి

కమలాపూర్ : ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన కమలాపూర్‌లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కళగానే మిగిలిపోయింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామంటూ దశాబ్దాల కాలంగా పాలకులు ప్రకటన చేయగా.. అప్పుడప్పుడు అధికారులు సర్వేల పేరిట హడావుడి చేయడంతోనే సరిపె పెట్టుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.1.71 కోట్లు మంజూరుకాగా ఆ నిధులు బస్టాండ్ నిర్మాణానికి ఏ మాత్రం సరిపోలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ మంజూరైన నిధుల వరకే పనులు చేసి మధ్యలోనే నిలిపివేశాడు. కమలాపూర్ నుంచి హనుమకొండ, హుజూరాబాద్, పరకాల, జమ్మికుంట తదితర పట్టణాలకు నిత్యం వందలాది మంది విద్యార్థులు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కమలాపూర్ నుంచి ఆర్టీసీకి భారీగానే ఆదాయం సమకూరుతున్నప్పటికీ బస్టాండ్ నిర్మాణంలో ఆర్టీసీ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రులైనా నెరవేరని కళ..

కమలాపూర్ నుంచి ప్రాతినిత్యం వహించిన ప్రజాప్రతినిధులంతా ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన వారేనని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, మూడు సార్లు మంత్రి పదవులు చేపట్టిన ముద్దసాని దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కేబినెట్‌లో రవాణాశాఖ మంత్రిగా, ఆ తర్వాత స్థానికుడైన ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ప్రస్తుత హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గతంలో మండలిలో ఎమ్మెల్సీగా కూడా పని చేశారు. ఐనప్పటికీ ఇప్పటి వరకు ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసేందుకు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిధుల లేమితో నిలిచిపోయిన నిర్మాణం..

అన్ని అడ్డంకులు అధిగమించి ఎట్టకేలకు కమలాపూర్ బస్టాండ్ నిర్మాణానికి రూ.1.71 కోట్లు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టి మంజూరైన నిధుల వరకు పనులు చేపట్టి ఆ తర్వాత నిధులు లేవని బస్టాండ్ నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేశాడు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా బస్టాండ్ నిర్మాణం కాస్త అసంపూర్తిగానే నిలిచిపోయింది. దీతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయిన కమలాపూర్ బస్టాండ్ ప్రస్తుతం పగటి పూట వాహనాల పార్కింగ్‌కు, పంచాయతీలకు, చీకటి పడితే మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. దీంతో స్థానికులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దుకాణ సముదాయాలే దిక్కు..

కమలాపూర్‌లో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణీకులు బస్సుల కోసం ఎండైనా, వానైనా రోడ్లపై, రోడ్డుకిరువైపుల ఉన్న దుకాణాల ఎదుట నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నిధులు లేకపోవడంతో అర్థంతరంగా నిలిచిపోయిన బస్టాండ్ నిర్మాణం



వాహనాల పార్కింగ్ స్థలంగా మారిన బస్టాండ్



బస్సుల కోసం దుకాణాల ఎదుట కూర్చొని నిరీక్షిస్తున్న ప్రయాణికులు

త్వరగా పూర్తి చేయాలి



కమలాపూర్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ నిర్మాణం పూర్తికాకపోవడంతో దుకాణాల ముందు కూర్చొని బస్సుల కోసం వేచిచూడాల్సి వస్తుంది. నిధులు వెంటనే మంజూరు చేసి పనులు త్వరగా పూర్తి చేయాలి.

– మోకిదె వెంకటేశ్వర్లు, పంగిడిపల్లి

ఎమ్మెల్యే, మంత్రి వెంటనే స్పందించాలి

దశాబ్దాల కాలంగా ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ నిర్మాణానికి ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయని తెలిసి సంబురపడ్డాం. కానీ ఆ నిధులు సరిపోకపోవడంతో సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలుపుదల చేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేయాలి. కమలాపూర్ నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. బస్సుల కోసం వివిధ షాపులు, రోడ్డుకిరువైపులా వేచిచూడాల్సి వస్తోంది. ఎండాకాలం ఎండలో, వర్షం కాలం బురదలో వేచిచూస్తూ ఇబ్బందులు పడుతున్నాం. పాలకులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా దృష్టిసారించి వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేయాలి.



– మాట్ల సురేందర్, స్థానికుడు

ఓటమి గెలుపునకు నాంది : ఆర్డీఓ



పరకాల : మహనీయుల జీవితాలన్నీ పడిలేచిన కెరటాలుగా ఉంటాయని, అందుకే వారి స్ఫూర్తితో విద్యార్థులు ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలని ఆర్డీఓ డాక్టర్ నారాయణ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిశోర్‌కుమార్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో డిగ్రీ చదువు అత్యంత కీలకమన్నారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృధా చేయకుండా బంగారు భవిష్యత్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఓ మంచి స్నేహితుడిగా సెల్‌ఫోన్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలే తప్పా చెడు మార్గాలకు వినియోగించొద్దని సూచించారు. ఓరియేంటేషన్ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ విజయపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్ మోరె తదితరులు పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ

ఐనవోలు : లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు ధ్వంసమైంది. ఈ సంఘటన మండలంలోని వరంగల్–ఖమ్మం రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ నుంచి వర్ధన్నపేటకు లారీ వెళ్తుండగా కారు వర్ధన్నపేట నుంచి వరంగల్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో పున్నేలు క్రాస్ సమీపంలోని వరంగల్–ఖమ్మం రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసం కాగా ఎలాంటి ప్రాణాపాయం జరుగలేదు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషిచేయాలి

దామెర : ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పరకాల సీడీపీఓ స్వాతి అన్నారు. జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని పులుకుర్తిలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణుల నుంచి మొదలుకొని రెండు సంవత్సరాల శిశువు వరకు తల్లీబిడ్డల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు పోషణ అభియాన్ కార్యక్రమం చేపట్టామన్నారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అదించే బాలామృతంలో పోషకపదార్థాలు అధికంగా ఉంటాయని వెల్లడించారు. బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసన, వెల్ బేబి షో నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ భాగ్యలక్ష్మి, సూపర్ వైజర్ రాణి, హెల్త్‌సూపర్‌వైజర్ అశోక్‌బాబు, అంగన్‌వాడీ సిబ్బంది సరళ, ఉదయ, జయ, రేణుక, సంధ్య, ఆశాకార్యకర్తలు, తల్లులు, పిల్లలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



పులుకుర్తిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ స్వాతి

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

వైకుంఠధామం నిర్వాహణ కోసం పాడెకు రూ. వెయ్యి వసూలుకు తీర్మానం..!

నడికూడ : పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించొద్దని నడికూడ గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకుంఠధామం నిర్వాహణ కోసం ప్రతీ అంత్యక్రియకు యూజర్ చార్జీగా వెయ్యి రూపాయలు వసూలు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. షాప్‌ల యజమానులు ప్లాస్టిక్ సంచుల్లో వస్తువులను విక్రయించకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు, మాజీ ఎంపీటీసీ అప్పం చేరాలు పాల్గొన్నారు.

ప్రజలు పోలీస్‌లకు సహకరించాలి



ఆత్మకూరు : ప్రజలు పోలీస్‌లకు సహకరించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ సూచించారు. మండలంలోని అక్కంపేటలో శనివారం సాయంత్రం కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఆత్మకూరు, పరకాల సీఐలు సంతోష్, క్రాంతికుమార్‌తో పాటు 60 పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించి మద్యం, గుడుంబా, 80 కిలోల బెల్లం, 2 ఆటోలు, 9 బైక్‌లు సీజ్ చేశారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతియుత వాతావరణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ మధన్‌మోహన్‌రావు

శాయంపేట : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులు దరిచేరవని అడిషినల్ డీఎంహెచ్‌ఓ మధన్‌మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాల ప్రాంగణాన్ని, వంట గదిని, భోజనశాలను, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ విజృంభిస్తుందని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ వైద్య సిబ్బందిచే వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. పాఠశాలలు, హాస్టల్స్ నుంచి నీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్ చేయించాలని, నీటిని క్లోరినేషన్ చేయాలని, దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ రేవతి, వైద్యాధికారి సాయికృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలివ్వాలి



కమలాపూర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

కమలాపూర్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ఎక్కటి సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాల హామీని కూడా త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధలో పాల్పంచుకున్న ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఊకంటి మల్లాచారి, ఉద్యమకారులు ఇమ్మడిశెట్టి శ్రీనివాస్, మోటం సంపత్, మాట్ల రమేశ్, జేరుపోతుల రమేశ్, నరిగె ఓదెలు తపాల్గొన్నారు.

యుద్ధం వద్దు.. శాంతి మార్గమే ముద్దు

- బిట్స్ ప్రిన్సిపాల్ యుగేందర్

పరకాల : అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని బిట్స్ ఆవరణంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిట్స్ విద్యార్థులు శాంతి చిహ్నంతో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ వేడుకలకు పాఠశాల ప్రిన్సిపాల్ యుగేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రస్తుత ప్రపంచంలో దేశాలు, సమూహాలు, తీవ్రమైన ఘర్షణలో మునిగితేలుతున్నప్పటికీ నేడు ప్రపంచ వ్యాప్తంగా కాల్పుల విరమణ ప్రకటిస్తూ శాంతి కోసం పలు కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటిగా మారిందన్నారు. సంపూర్ణ ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్య సమితి కార్యాలయ ఆవరణలో శాంతి గంట మోగించడం జరుగుతుందన్నారు. యుద్ధం కంటే శాంతిమార్గం ఎంతో గొప్పదన్నారు. విద్యార్థులు శాంతిమార్గాన్ని ఎంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రపంచ శాంతి చిహ్నంలో బిట్స్ విద్యార్థులు

‘బాపూజీ’ సేవలు స్ఫూర్తిదాయకం



పరకాల : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోపా నాయకులు



ఎల్కతుర్తి : ముల్కనూరులో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూరు : లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

పరకాల: మూడు తరాల స్వాతంత్ర్య పోరాటాల్లో చురుకైన పాత్ర పోశించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళులు అని పరకాల పోపా అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ అన్నారు. లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం, నిజాం వ్యతిరేక పోరాటంలోనూ ముఖ్యభూమిక పోషించిన బాపూజీ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముందు నిలిచి తన జీవితాన్ని ఉద్యమాలకే అంకితం చేశారని కొనియాడారు. 90 ఏళ్ల వయస్సులో కూడా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టారని గుర్తుకు చేశారు. సీనియర్ జర్నలిస్టు రవీందర్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దయాకర్, పద్మశాలి ఫైనాన్స్ కమిటీ సభ్యుడు అశోక్, పద్మశాలి ట్రస్ట్ బోర్డు కార్యదర్శి దేవేందర్, పోపా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో శనివారం మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా జాయింట్ సెక్రెటరీ సదానందం, ప్రసాద్, కిశోర్, రవీందర్, వేణుగోపాల్, కేదారి, రంజిత్, లక్ష్మణమూర్తి, రవితేజ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మంత్రి పదవిని వదిలేసిన గొప్ప మహనీయుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ అని కాంగ్రెస్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కొనియాడారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, రవి, మార్కండేయ, రాము, రాజు, కట్టయ్య, ప్రపంచరెడ్డి పాల్గొన్నారు. అలాగే పద్మశాలి యువసేన ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించి లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి యువసేన అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సాంబయ్య, సంతోష్, సుమన్, భద్రయ్య, రమేష్, తరుణ్, రంజిత్, రవి, మార్కండేయ, రాజు, అశోక్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజా గ్రంథాలయంలో శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని డాక్టర్ ఎదులాపురం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషిని కొనియాడారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకొని త్యాగం చేశారని తెలంగాణ సమాజం ఆయనకు రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమురయ్య, నాయకులు ప్రకాశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలను వీడాలి

ధర్మసాగర్ : విద్యార్థులు మూఢనమ్మకాలను వీడాలని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ వరంగల్ ప్రొఫెసర్ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా మానవ సంక్షేమంలో శాస్త్రీయ దృక్పథం డిజిటల్ విప్లవం పాత్రపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార, కృత్రిమ మేధ విప్లవంతో జ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. దానిని వినియోగించుకోవడంలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. మానవ అవసరాలను అర్థం చేసుకొని తమ సృజనాత్మకతకు పదును పెట్టాలన్నారు. సైన్స్ సాంకేతిక పరిజ్ఞానంతో పారిశ్రామిక పెట్టుబడి పెరిగిందని, దీని ద్వారా ఉద్యోగ కల్పన పెరిగి పేదరికం తగ్గిందని, విద్య, వైద్యం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల నుంచి ఎదిగి సామాజిక బాధ్యతతో పని చేస్తున్న స్ఫూర్తిదాయక వ్యక్తుల పరిచయ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆంజనేయులు

పదోన్నతి

శాయంపేట : 1996 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన జంపాల మధుసూదన్ (మధు)కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన ఆయన.. ప్రస్తుతం హనుమకొండ ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్ పని చేస్తూ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. గ్రామస్తులు అభినందనలు తెలిపారు.